వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 220

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: శనివారం 12 సెప్టెంబర్ 2026







**సమయం ప్రతినిధి:** ఏడేళ్ల తరువాత భారత్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాబోతున్నారు. రేపు, ఎల్లుండి (ఆదివారం, సోమవారం) జరగబోయే బ్రిక్స్ సదస్సులో ఆయన పాల్గొన బోతున్నారు. 2019లో భారత్–చైనా సరిహద్దుల్లో చోటుచేసుకున్న గల్వాన్ ఘర్షణల అనంతరం చైనా అధినేత భారత్‌కు రావడమిదే తొలిసారి. బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరు దేశాలకు సంబంధించిన ప్రత్యేక చర్చలో ప్రధాని మోదీ, జిన్‌పింగ్ పాల్గొననున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య మైత్రి బలపడనుందని, వాణిజ్య సంబంధాలు మళ్లీ మెరుగవుతాయని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మోదీ, జిన్‌పింగ్ చర్చ పలు కీలక అంశాలపై జరగనుంది. ముఖ్యంగా భారత్–చైనా సరిహద్దు ప్రాంతాల్లో ఘర్షణలకు ముగింపు చెప్పాలని మోదీ సూచించే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. శాంతియుత వాతావరణం ఏర్పాటు దిశగా చర్చ సాగుతుందని విశ్లేషిస్తున్నారు. నిరుడు రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులోనే మోదీ, జిన్‌పింగ్‌ల మధ్య సరిహద్దు వివాదం విషయంలో ఓ కీలక ఒప్పందం జరిగింది. అందులో భాగంగా అక్కడి సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో చర్చించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

**వాణిజ్యంపైనే ప్రత్యేక దృష్టి :** కాగా.. భారత్ ద్వైపాక్షిక వాణిజ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. రెండు దేశాల మధ్య జరిగే వాణిజ్యంలో అసమానతలు ఉన్నాయని భారత్ భావిస్తోంది. చైనా నుంచి భారీగా దిగుమతులు చేసుకుంటున్న భారత్.. ఎగుమతుల విషయంలో మాత్రం వెనుకబడింది.




**సమయం ప్రతినిధి:** వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కీలక వ్యాఖ్యలు చేసింది. బ్యాంకుల బకాయిల్లో భారీ మొత్తాన్ని రికవరీ చేసినంత మాత్రాన విజయ్ మాల్యాపై కొనసాగుతున్న ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (PMLA) విచారణలు, క్రిమినల్ ప్రాసిక్యూషన్ ముగిసిపోవని బాంబే హైకోర్టుకు తెలిపింది. మాల్యా ఆస్తుల నుంచి బ్యాంకుల కన్సార్టియం దాదాపు రూ.15,000 కోట్ల మేర రికవరీ చేసిందని ఆయన తరఫు న్యాయవాది గతంలో కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ద్వారా బ్యాంకులకు భారీ మొత్తంలో డబ్బు తిరిగి వచ్చిందని తెలిపారు. అసలు బకాయిల సమస్య దాదాపు పరిష్కారమైనందున, తనపై కొనసాగుతున్న కొన్ని న్యాయపరమైన చర్యలను ముగించాలని కోర్టును మాల్యా కోరుతున్నారు. అయితే ఈ రికవరీ అంశం సివిల్ బకాయిలకు సంబంధించినదని, మనీలాండరింగ్‌కు సంబంధించిన క్రిమినల్ కేసులు మాత్రం ప్రత్యేకమైనవని ఈడీ తన సమాధానంలో స్పష్టం చేసింది. విజయ్ మాల్యా 2016లో భారత్‌ను విడిచి బ్రిటన్‌కు వెళ్లిపోయారు (Vijay Mallya bank dues). 2019లో ఆయనను 'ఫ్యూజిటివ్ ఎకనామిక్ అఫెండర్'గా ప్రకటించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన బ్యాంకు రుణాల వ్యవహారంలో ఆయనపై మనీలాండరింగ్, ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు కొనసాగుతున్నాయి. మాల్యా ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్నారు.




**సమయం ప్రతినిధి:** 22A జాబితాలో 232 అంశాలను పరిష్కరించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రూ.5 వేల కోట్ల విలువైన 31 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని.. దీని ద్వారా లక్షలాదిమందికి లబ్ధి కలిగిందని వ్యాఖ్యానించారు. పెండింగ్ భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో రెండో రోజు జిల్లా కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈరోజు (శుక్రవారం) కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అంశాలపై ఆ శాఖ ఉన్నతాధికారులకు, కలెక్టర్లకు సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. భూ సమస్యల పరిష్కారంలో అవినీతికి తావివ్వొద్దని నిర్దేశించారు. బ్యాక్‌లాగ్ భూ వివరాలను 45 రోజుల్లో నమోదు చేయాలని సూచించారు. గుర్తించినట్లు బింద్కి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ శైలేష్ సింగ్ తెలిపారు. భూ వివరాలను బ్లాక్ చెయిన్‌లో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లోని భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం... ప్రభుత్వం తీసుకుంటున్న పాలసీల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. మంత్రులు, అధికారులు కూడా ఈ సమస్యలను పరిష్కరించిన విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంబాజీపేటలో గ్రౌండ్ రెంట్ భూముల అంశం 120 ఏళ్ల కాలం నాటి సమస్య అని.. అలాంటి సమస్యను పరిష్కరించామని స్పష్టం చేశారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** తెలంగాణ అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన బీసీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కమలం పార్టీ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు. దీనిపై శాసనసభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేయడం బాధాకరమని అన్నారు. బీసీల హక్కులు, రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తన నిజమైన వైఖరిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీని బీసీ ద్రోహుల పార్టీ, మనువాదుల పార్టీ అంటూ మంత్రి పొన్నం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం జరిగేలా ముందుకెళ్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ వైఖరిని తెలంగాణలోని బీసీ ప్రజలు గమనించాలని, బీసీ సంఘాలు ఆ పార్టీ నాయకత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కులగణన ద్వారా దేశంలో నెలకొన్న కుల అసమానతలను తగ్గించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బీసీ కులగణన విషయంలో కేంద్రం ఒకటి చెబుతూ.. మరోటి చేస్తోందని ఆరోపించారు. ఇకనైనా బీసీల డిమాండ్‌ను కేంద్రం గుర్తించి కులగణన చేపట్టాలని కోరారు. బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన తీర్మానంపై బీజేపీ వాకౌట్ చేయడం దారుణమని మంత్రి సీతక్క అన్నారు. ప్రధాని మోదీ పేరుకే బీసీ అని, కానీ జనగణనలో కులగణన చేపట్టేందుకు కేంద్రం ముందుకు రావడం లేదని విమర్శించారు. బీసీలు కేవలం వెనుకబడిన వర్గాలు కాదని.. దేశానికి వెన్నెముకలాంటి ఉత్పత్తి కులాలని పేర్కొన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీల పాత్ర దేశ జీడీపీలో కీలకమన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పటికీ కులవృత్తులపై ఆధారపడిన వారి ఆర్థిక పరిస్థితి మరింత సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. బీసీ తీర్మానంపై చర్చను పక్కదారి పట్టించి పాయల్ శంకర్ మాట్లాడటం సరికాదన్నారు.




**సమయం ప్రతినిధి :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేడు(శుక్రవారం) ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతానికి, ప్రపంచ జీడీపీలో 40 శాతానికి, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయన్నారు. గత కొన్నేళ్లలో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు పెరిగిందని మోదీ పేర్కొన్నారు. అదే సమయంలో బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ దాదాపు నాలుగున్నర రెట్లు విస్తరించిందని చెప్పారు. అంటే ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థిక బలం దాదాపు రెండింతల వేగంతో పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. బ్రిక్స్ దేశాలు ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని ఈ సందర్భంగా మోదీ అన్నారు. అట్టడుగు స్థాయి ప్రజాప్రయోజన కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు.. విస్తృత స్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు తమ దేశాల్లో రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలకు బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న ప్రాధాన్యం.. వాటి భవిష్యత్తు సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని కొనియాడారు. బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న స్థాయి, వేగం, ఆశావాదం స్పష్టంగా కనిపిస్తున్నాయని మోదీ చెప్పుకొచ్చారు. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సభ్య దేశాల మధ్య సహకారం మరింత విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. భారత్ వేదికగా జరుగుతున్న ఈ సమావేశం ఇప్పటివరకు నిర్వహించిన వాటిలో అతిపెద్ద ఫోరమ్ అన్నారు. వివిధ దేశాల వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఒకే వేదికపైకి రావడం ద్వారా కొత్త అవకాశాలకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులు, ఆవిష్కరణలు, సాంకేతిక సహకారం మరింత బలోపేతం కావడానికి ఈ వేదిక సహకరిస్తుందని ఆయన అన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**అప్పన్నపల్లిలో రెండు పెద్ద కృత్రిమ నీటి గుంతలు.. బీచుపల్లిలో పెద్ద విగ్రహాల నిమజ్జనం**
**నిమజ్జన కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి**



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11, సమయం ప్రతినిధి:** వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి ఆదేశించారు. వర్షాభావంతో చెరువుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్, ఎస్పీ శుక్రవారం క్రిస్టియన్‌పల్లి పంచవటి పాఠశాల సమీపంలోని కృత్రిమ నీటి గుంతతో పాటు పాలకొండ, శ్రీనివాస్‌కాలనీ, అప్పన్నపల్లి, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించారు. అప్పన్నపల్లి చెరువు వద్ద అధిక సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున రెండు పెద్ద కృత్రిమ నీటి గుంతలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాల కోసం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో కృత్రిమ నీటి గుంతలు ఏర్పాటు చేసి తగినంత నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలతో పాటు వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును పెంచాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ డి.జానకి సూచించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**బీచుపల్లిలో పెద్ద విగ్రహాల నిమజ్జనం**

మహబూబ్‌నగర్ నుంచి వచ్చే పెద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఖుష్బూ గుప్తా తెలిపారు. దీనికి గద్వాల కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. నిమజ్జన కేంద్రాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్, శిల్పారామాన్ని కలెక్టర్, ఎస్పీ సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, డీఆర్‌డీవో నరసింహులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# భూ రికార్డుల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



**వేకువ సమయం// సెప్టెంబర్ 11, 2026 :** జిల్లాలో భూ రికార్డుల నవీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జి.పి.ఓ., ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్‌లతో నెన్నెల మండలంలోని చిన్న వెంకటాపూర్, పుప్పాలవానిపేట గ్రామాలలో భూ రికార్డుల నవీకరణకు సంబంధించి చేపడుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ రిజిస్టర్ పూర్తి చేయడం, కొరిలేషన్ స్టేట్‌మెంట్ తయారీ, ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. భూ రికార్డుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, భూ రికార్డుల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఎవరి కోసం ఈ బ్యాంకింగ్ సంస్కరణలు?

మన దేశ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థలో పెనుమార్పులు జరగబోతున్న సంకేతాలు, ప్రకటనలు అనేకం చూస్తున్నాం. ప్రభుత్వ బ్యాంకుల సేవల మీద ఆధారపడ్డ విస్తృత ప్రజానీకం, మధ్యతరగతి మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు, చిన్న-మధ్యతరహా పరిశ్రమల అధిపతులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవాలి, స్పందించాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు ప్రజలది. బ్యాంకుల మూలధనం (కాపిటల్) ప్రజలు కట్టిన పన్నుల ఆదాయం నుంచి సమకూర్చినది. లక్షల కోట్ల రూపాయల లాభాలు ఉద్యోగుల శ్రమశక్తితో సంపాదించినవి. భారత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న 'వికసిత్ భారత్-2047' సాధనలో బ్యాంకుల పాత్ర ఎలా ఉండాలో అధ్యయనం చేయడం కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. తదనుగుణంగా, ఆగస్టు 17, 18 తేదీల్లో ఆర్థికమంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రభుత్వరంగ బ్యాంకుల శిఖరాగ్ర సమావేశం ఆ ఉన్నతస్థాయి కమిటీకి నివేదించాల్సిన ప్రతిపాదనల మీద చర్చించింది. దీనికితోడు ప్రధానమంత్రి తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రపంచస్థాయి ఐదు పెద్ద బ్యాంకులలో కనీసం ఒక భారతీయ బ్యాంకు ఉండాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవన్నీ బ్యాంకింగ్ రంగంలో పెనుమార్పులకు సంకేతం. అద్భుతమైన ఈ నినాదాల వెనుక దాగి ఉన్న నిజాలేమిటి? ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు (డిపాజిట్లు)లో 60శాతం పైగా సొమ్ము సామాన్యులు, ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్లకోసం దాచుకున్నదే. ఈ కష్టార్జితాన్ని సేవింగ్స్ ఖాతాలో పెట్టుకుంటే బ్యాంకులు చెల్లించే వడ్డీ 2.5 శాతం నుంచి 2.7శాతం. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే 6.5శాతం. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ద్రవ్యోల్బణం 6శాతానికి చేరువలో ఉంది. అంటే ప్రతి ఏటా సామాన్యుడు దాచుకున్న పొదుపు విలువ తగ్గుతోంది తప్ప, రూపాయి విలువకు రక్షణ లేదు. బ్యాంకు రుణాల విషయంలో కూడా ప్రజలు ఆర్థికదోపిడీకి గురవుతున్నారు. సంస్కరణల పేరుతో బ్యాంక్ విధానాలలో వచ్చిన మార్పులే దీనికి కారణం. బ్యాంకులు మొత్తం ఇచ్చే రుణాలలో 40శాతం ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, చేతి వృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఇవ్వాలి. ఈ రుణాలు ఇవ్వని బ్యాంకుల మీద ఒకప్పుడు పెనాల్టీలు వేసేది రిజర్వ్ బ్యాంక్. కానీ బ్యాంకింగ్ సంస్కరణల అమలుతో మైక్రోఫైనాన్స్ కంపెనీలకు, నాన్--బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) ఇచ్చిన రుణాలనే ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చినట్టుగా పరిగణించడం మొదలయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రైతులు, సామాన్యులకు ఇవ్వవలసిన రూ.14 లక్షల కోట్ల సొమ్మును ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చాయి. ఇదే సొమ్మును మైక్రోఫైనాన్స్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు సామాన్య ప్రజలకు అప్పుగా ఇచ్చి, 20-30శాతం వడ్డీ వసూలు చేస్తూ వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తున్నాయి. ఆ రుణభారం, అప్పుల ఊబి నుంచి బయటపడలేక అనేక కుటుంబాలు బలవన్మరణానికి పాల్పడుతున్న వార్తలు నిత్యం చూస్తూనే ఉన్నాం. బ్యాంకులే నేరుగా అప్పులివ్వొచ్చుగా... మధ్యలో ఈ మధ్యవర్తులెందుకు? వైపరీత్యం ఏమిటంటే బ్యాంకులలో తన పొదుపు సొమ్ము దాచుకునే సామాన్యుడు ఒకవైపు దోపిడీకి గురవుతున్న రుణదాత. రెండోవైపు ఎన్‌బీఎఫ్‌సీల వద్ద అధిక వడ్డీ దోపిడీకి గురయ్యే రుణగ్రహీత. ఈ దోపిడీలను కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఎందుకు అనుమతిస్తున్నాయి? దీనికితోడు, గత ఐదేళ్ల కాలంలో ఖాతాలో మినిమం బ్యాలెన్స్ లేదనో, తగిన బ్యాలెన్స్ లేకుండా చెక్కులు ఇచ్చారనో, ఇంకా అనేక కారణాలతో పెనాల్టీల రూపంలో ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.28,495 కోట్లు వసూలు చేశాయి. పార్లమెంటు చట్టాల ద్వారా ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలు లేబర్ చట్టాలను అమలుచేస్తూ 'మోడల్ ఎంప్లాయర్'గా ఉండాలి, పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలి. ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందించడానికి, పెరుగుతున్న వ్యాపారానికి తగినట్టుగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. కానీ ప్రభుత్వరంగ బ్యాంకులలో పర్మినెంట్ ఉద్యోగులకంటే ఎన్నోరెట్లు అధికంగా క్యాజువల్, టెంపరరీ, అప్రెంటిస్, కాంట్రాక్టు, ఫిక్స్‌డ్ టర్మ్, బిజినెస్ కరస్పాండెంట్లు తదితర అనేక రూపాలలో పర్మినెంట్ ఉద్యోగులు చెయ్యాల్సిన పనులే చేస్తున్నారు. వీరికి సరైన జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు లేవు. బ్యాంకుల్లో కనీసం లక్షా నలభైవేల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొండి బాకీలను సమర్థవంతంగా వసూలు చెయ్యబోతున్నట్టు ప్రకటించింది. ఆ పేరుతో 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ చట్టం-2016' చేసింది. ప్రత్యేకంగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్, ఎన్‌సీఎల్‌టీలు సైతం ఏర్పాటు చేశానని చెప్పింది. కానీ, అప్పటివరకూ లేని విధంగా బ్యాంకులు పెద్ద ఎత్తున మొండి బాకీలు రద్దు చేసుకుంటున్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్, జీ నెట్వర్క్ లాంటి ఏడు కంపెనీలు అవి చెల్లించాల్సిన సొమ్ములో 97శాతం రద్దయి, 3శాతమే వసూలయ్యింది. ఈ ప్రభుత్వకాలంలో రూ.18 లక్షల కోట్లను మొండి బకాయిలుగా పరిగణించాయి. లక్షలాదిమంది బ్యాంకు ఉద్యోగుల శ్రమతో సంపాదించిన లాభాలు, ప్రజలపై పన్నుల ద్వారా సంపాదించిన పెట్టుబడి ఇలా బాకీల రూపంలో కార్పొరేట్ కంపెనీలకు చేరింది. ప్రభుత్వం చేసిన చట్టాలు బాకీలను వసూలు చెయ్యడం కాక, కార్పొరేట్ రుణాల రద్దును చట్టబద్ధం చేశాయి. ఇదే సొమ్ము సామాన్య ప్రజలకు, వ్యవసాయరంగానికి, ఎంఎస్‌ఎంఈలకు రుణాలుగా ఇచ్చి ఉంటే దేశ ఆర్థికవ్యవస్థ ఎంతో వృద్ధిచెందేది. ఎంప్లాయిమెంట్ పెరిగేది. కార్పొరేట్ శక్తులు, బ్యూరోక్రసీ, రాజకీయ శక్తుల అపవిత్ర కూటమి (నెక్సస్) వలనే ఇంత ప్రజాధనం దోపిడీకి వీలుకలిగిందనేది వాస్తవం కాదా? ఇది కాకులను కొట్టి గద్దలకు వెయ్యటం కాక మరేమిటి? ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలలో అనుభవం ఉన్నవారిని ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చైర్మన్లు తదితర ఉన్నతాధికారులుగా నియమించాలని, బ్యాంకుల మూలధనంలో విదేశీ పెట్టుబడిని 49శాతానికి పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడి లాభాల కోసమే వస్తుంది, లాభాలు లేకపోతే వాపసు వెళ్తుంది. అప్పుడు బ్యాంకులు ఆర్థిక ఒడుదుడుకులకు లోనవుతాయి, ప్రజల పొదుపు ప్రమాదంలో పడుతుంది.అందుకే, ఈ పరిస్థితులను అధ్యయనం చేసి వాస్తవాలను సామాన్య ప్రజానీకానికి, ప్రజాస్వామ్య శక్తులకు, రైతు, కార్మిక సంఘాలకు, దేశ యువతకు తెలియజేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక -యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్- నిర్ణయించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజల పొదుపుతో నడుస్తున్న ప్రజాసంస్థలు. ప్రజల పొదుపునకు ద్రవ్యోల్బణం నుంచి రక్షణనిచ్చేవిధంగా వడ్డీ రేట్లు పెంచాలని, దేశ ఆర్థికవ్యవస్థ సమ్మిళిత వృద్ధికి వెన్నెముకలైన వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు, మౌలిక వసతుల రంగానికి ఎటువంటి మధ్యవర్తి సంస్థలు లేకుండా నేరుగా తక్కువ వడ్డీకి రుణాలనివ్వాలని సంఘాలు కోరుతున్నాయి. విధాన నిర్ణయాలు చేసే బ్యాంకు బోర్డులలో ఉద్యోగ సంఘాలకు, రైతు, కార్మిక, ఎంఎస్‌ఎంఈ రంగాల నిపుణులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. దీనివలన రుణాల మంజూరు, వసూలు లాంటి అంశాలమీద పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవటం ప్రజలందరి కర్తవ్యం. అది దేశ ఆర్థిక స్వావలంబనకు, సమ్మిళిత వృద్ధికి ఆధారంగా నిలుస్తుంది.

# సమాజంలో అత్యున్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

## ప్రాథమిక పాఠశాల కంబాలపల్లి ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులచే ఘన సన్మానం




మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 11 ( వేకువ సమయం ప్రతినిధి): ప్రాథమిక పాఠశాల కంబాలపల్లి లో ఈరోజు విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ మందుల శ్రీరాములు గారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు సన్మానించడం ఉపాధ్యాయులకు గొప్ప వరమని ఇలాంటి అవకాశం కొందరికే దక్కుతుందని, ఆ అవకాశం వీరికి దక్కడం గొప్ప అదృష్టంగా భావించాలని అన్నారు. గ్రామంలో విద్యార్థిని విద్యార్థులకు చక్కని విద్యాభ్యాసాన్ని మరియు విద్యార్థులను సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తు వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులే ముందుకు వచ్చి ఉపాధ్యాయులను సన్మానించడం జరిగిందని వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేస్తున్నారని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యాశాఖ బలోపేతం చేస్తూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గారి ఆదేశాల మేరకు అన్ని విద్యాసంస్థలలో ఇంగ్లీష్ ప్రావీణ్యత, ప్రతి సబ్జెక్టుపై పట్టు వచ్చే విధంగా ప్రత్యేక తరగతులు, నిర్వహిస్తూ, పక్క డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, అత్యుత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారని, నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధనలు సాగుతున్నాయని, కావున జిల్లా ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత భవిష్యత్తు కోసం ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసరావు, జెడి అనసూయ, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, హార్టికల్చర్ అధికారి మరియన్న, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతి గిరిజ, తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షులు కొలిశెట్టి సత్యనారాయణ, కంబాలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సన్మాన గ్రహీతలు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ఉపాధ్యాయులు ఆవునూరి రవి, ఆర్ రాధిక, సిహెచ్ శ్రీజ, కవిత, మమత మరియు విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు అచ్చ ప్రశాంత్, సందు సురేష్, కారింగుల రాజశేఖర్, లావణ్య , అబ్దుల్ హైమద్, పెద్ద మాముల నాగరాజు, విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ హాదీ మృతి తీరని లోటు: ఎంపీ డీకే అరుణ



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11, సమయం ప్రతినిధి: మహబూబ్‌నగర్ జిల్లా ఏఐఎంఐఎం అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హాదీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎంపీ డీకే అరుణ శుక్రవారం పట్టణంలోని మదీనా మసీదు సమీపంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అబ్దుల్ హాదీ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ డీకే అరుణ.. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. అబ్దుల్ హాదీ మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని, ఆయన మరణం తీరని లోటని అన్నారు. పార్టీలకు అతీతంగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అబ్దుల్ హాదీ కృషి చేసేవారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అందరికీ అందుబాటులో ఉండేవారని పేర్కొన్నారు. రాజకీయంగా పార్టీల వేర్వేరు అయినప్పటికీ అందరితో ఆయన సత్సంబంధాలు కొనసాగించారని డీకే అరుణ అన్నారు.

# ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు తేదీలతో మరణ ధృవపత్రాల జారీ

**బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ ఉత్తర్వులు**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 11: ఒకే మరణించిన వ్యక్తికి రెండు వేర్వేరు తేదీలతో మరణ ధృవపత్రాలు జారీ చేసిన ఘటనపై నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. రమేష్ బాబును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని నాగర్ కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు.

ఇటీవలే వివిధ తెలుగు దినపత్రికల్లో "ఒక్కరికీ రెండు ధృవపత్రాలు" అనే శీర్షికన వెలువడిన వార్తలపై విచారణ చేపట్టాలని అచ్చంపేట డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశించగా, విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ శుక్రవారం ఈ చర్యలు తీసుకున్నారని డిపిఓ తెలిపారు.

విచారణ నివేదిక ప్రకారం, బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా 01.08.2024 నుంచి విధులు నిర్వహిస్తున్న వి. రమేష్ బాబు హయాంలో ఒకే మరణించిన వ్యక్తికి రెండు పర్యాయాలు వేర్వేరు తేదీలతో మరణ ధృవపత్రాలు జారీ చేసినట్లు గుర్తించడం జరిగిందని, సంబంధిత వివరాలు ఆన్‌లైన్ రికార్డుల్లో రెండుసార్లు నమోదు కాగా, మరణ ధృవపత్రాల జారీ రిజిస్టర్‌లో మాత్రం ఒకసారి మాత్రమే నమోదు చేసినట్లు విచారణలో వెల్లడైందని,

ఒకే వ్యక్తికి వేర్వేరు తేదీలతో రెండు మరణ ధృవపత్రాలు జారీ చేయడం, గ్రామ పంచాయతీ చట్టబద్ధ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, అధికారాలను దుర్వినియోగం చేయడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం తక్షణ ప్రభావంతో సస్పెన్షన్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం సాయంత్రం తెలిపారు .

# పాడి రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే వీర్లపల్లి

హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం వివిధ రకాలుగా అండగా నిలుస్తున్నప్పటికీ, రైతుల ఆదాయాన్ని మరింత పెంచేందుకు పశు సంవర్ధక రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నేడు అసెంబ్లీలో పశు సంవర్ధక శాఖపై జరిగిన చర్చలో ఆయన పాడి రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో పశు వైద్యులు లేకపోవడంతో పశువులకు వైద్యం అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ప్రాంతంలో పాడి రైతులకు సకాలంలో పశు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు విజయ డైరీ ద్వారా పాడి రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాడి రైతులకు అవసరమైన సబ్సిడీలు అందించడంతో పాటు, వారు సరఫరా చేసిన పాలకు సంబంధించిన బిల్లులను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో వినియోగించే పాలు మరియు పాల ఉత్పత్తులను విజయ డైరీ నుంచే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీర్లపల్లి శంకర్ గారు కోరారు. గతంలో ప్రైవేట్ డైరీలను ప్రోత్సహించడం వల్ల విజయ డైరీ ఇబ్బందులను ఎదుర్కొన్న పరిస్థితి ఏర్పడిందని, ఇకపై ప్రభుత్వ సంస్థ అయిన విజయ డైరీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని కంసాన్‌పల్లిలో ఉన్న ఫ్రోజెన్ సెమెన్ బుల్ స్టేషన్‌ను అతి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలనిప్రభుత్వాన్ని కోరారు.

# మోదీ - పుతిన్ ద్వైపాక్షిక సమావేశం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాజాగా సమావేశమయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగంలో సహకారం తదితర అంశాలపై ఇరు దేశాధినేతలు చర్చించనున్నారు. గతేడాది డిసెంబర్‌లో భారత్-రష్యా శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రష్యా అధ్యక్షుడు ప్రధాని మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఇక రష్యాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు తాజా సమావేశానికి హాజరయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ అంశాలపై అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోదీతో చర్చించనున్నారని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి అంతకుముందు మీడియా ప్రతినిధులతో చెప్పారు. ఉక్రెయిన్‌తో ఘర్షణల గురించి కూడా అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోదీతో చర్చించనున్నారని తెలిపారు. ఈ చర్చల్లో రక్షణ రంగంలో సహకారం ప్రధానాంశం కానుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఇరు దేశాలు సంయుక్తంగా చేపట్టిన డిఫెన్స్ ప్రాజెక్టులు చర్చకు రానున్నాయి. ఈ ఏడాదికి బ్రిక్స్ కూటమికి ఛైర్‌గా భారత్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిక్స్ సమావేశాలకు ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తోంది. ఈ నెల 12-13 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా ఈ సమావేశాలు జరగనున్నాయి. కూటమి దేశాల మధ్య సహకారం మరింత పెంపొందించేందుకు బ్రిక్స్ దేశాల నేతలు ఈ సందర్భంగా చర్చించనున్నారు. అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై ఉమ్మడి ప్రాధాన్యాలు ఎజెండాగా సమావేశాలు జరుగుతాయని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# కాంట్రాక్ట్ అధ్యాపకుల శ్రమదోపిడీ ఆగేదెన్నడు?

సమయం ప్రతినిధి : ఒకవైపు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యాసంస్థల నిర్మాణం.. నలందా- తక్షశిలల నాటి ఘనత... ఏఐ యుగంలో సవాళ్లను ఎదుర్కొనే విద్యార్థుల తయారీ... అంటూ వెలువడే ప్రకటనల వెనక ఒక చేదు నిజం దాగి ఉంది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో గత పాతికేళ్లుగా యూజీసీ నిర్దేశించిన అత్యున్నత విద్యార్హతలు (పీజీ, పీహెచ్‌డీ, నెట్/సెట్) కలిగి బోధిస్తున్న దాదాపు 1,200 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తీవ్ర ఆర్థిక, ఉద్యోగ భద్రతా సంక్షోభంలో ఉన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్నా వీరి వేతనాలు 2019 నాటి స్థాయిలోనే నిలిచిపోయాయి. అదే తరగతి గదిలో, అదే సిలబస్‌ను బోధిస్తూ, అదే విశ్వవిద్యాలయ పరీక్షా బాధ్యతలు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకుల మధ్య వేతనాల్లో 167 శాతం వరకు వ్యత్యాసం ఉండటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లు కల్పించిన సమానత్వ హక్కుకే భంగం. షా సమీర్ భరత్‌భాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ (2025), స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ జగ్జిత్‌సింగ్ (2016) వంటి సుప్రీంకోర్టు తీర్పులు సమాన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని బలపరిచాయి. జీవోఎంఎస్ నెంబర్ 15 (2019) ద్వారా రెగ్యులర్ విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఏడో యూజీసీ పే స్కేల్ అమలైంది. దీంతో బేసిక్ పే రూ.21,600 నుంచి రూ.57,700కు, అంటే 167.6శాతం పెరిగింది. ఇందులో ఇంకా డీఏ, ఇతర అలవెన్సులు కలపలేదు. కాంట్రాక్ట్ అధ్యాపకుల బేసిక్ పే రూ.37,800 నుంచి రూ.57,700కు, అంటే కేవలం 52.6 శాతం మాత్రమే పెంచి ఫిట్‌మెంట్ బెనిఫిట్‌ను నిరాకరించారు. అలాగే జీవో ఆర్టీ నంబర్ 222 ప్రకారం డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్లకు 12 నెలల జీతం ఇస్తూ, విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అధ్యాపకులకు సంవత్సరానికి ఒక రోజు 'బ్రేక్' పేరుతో వేతనం కోత విధించడం వివక్షగా కనిపిస్తోంది. హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు రూ.57,700 బేసిక్ పేతో పాటు సుమారు రూ.16,156 డీఏ, అంటే నెలకు రూ.73,856కు పైగా గ్రాస్ శాలరీ లభిస్తోంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యూనివర్సిటీ 2021 నుంచే డీఏ, హెచ్‌ఆర్‌ఏలను చెల్లిస్తోంది.

# శ్రీశైలంలో సమృద్ధిగా నీళ్లు ఉన్నా..
# సాగుజాలాలు అందించలేని అసమర్థ ప్రభుత్వం

**రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస రైతులపై లేదు.**
**కె.ఎల్. ఐ పంపులు 24గంటలు నడపాలి.**
**అంతరాయం లేని కరెంట్ ఇవ్వాలి.**
**సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు.**



**వనపర్తి :** వనపర్తి జిల్లా రేవల్లి మండలం గొరీదేవిపల్లి వద్ద మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం స్టేజ్ 3 పంప్ హౌస్ ను మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లు ఉన్నా సాగుజాలాలు అందించలేని అసమర్థ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని ఆవేదన వ్యక్తం చేశారు.ఏదెచ్చగా ఆంధ్రా ప్రభుత్వం నీళ్లను తరలిస్తుంటే ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉమ్మడి పాలమూరు రైతులను హరిగోస పెడుతుందని దుయ్యబట్టారు. కె.ఎల్. ఐ పంపులు 24గంటలు నడిపి రైతులకు సాగు జలాలు అందించాలని డిమాండ్ చేశారు.వానాకాలం సీజన్ స్టార్ట్ అయినప్పటి నుండి ప్రభుత్వాన్ని అలెర్ట్ చేస్తున్నాం.ఎగువ నుండి వరద వస్తుందని చెప్పినం..180 పై చిలుకు నీళ్ళు శ్రీశైలంలో ఉన్నాయి. .మొదటి రోజు నుండే నీళ్ళు లేవని ప్రభుత్వం చెప్తుంది. పోతిరెడ్డిపాడు నుండి ఏపీ నీళ్ళు తరలించుకు పోతుంది.రోజుకు పది నుండి పన్నెండు టీ ఏం సి ల నీళ్ళు ఏపీ తీసుకెళ్తుంది..తెలంగాణ రెండు వందల రోజు లు పంప్‌లు నడిపితే 40 టీ ఏం సి నీళ్ళు మాత్రమే తీసుకో గలదు..కల్వకుర్తి పంప్ లు ఐదు కలిపితే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ లో ఒక్క మోటర్....పదేళ్లలో ఒక్కనాడు కూడా పంప్ లకు ఇబ్బంది లేదు..ప్రభుత్వం దొంగల్లాగా పంప్ లు నడుపుతుంది.కే ఎల్ ఐ పంప్ ల్లో మొన్న ఒకటి రిపేర్ అయింది.పవర్ సప్లయ్ సరిగా లేక మోటర్ బేరింగ్ పోయింది.ఉన్న నీళ్ళు తెలివిగా వాడుకోవడం చేతకావడం లేదు. కరెంట్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వట్లేదు..కేసీఆర్ రైతుల ప్రయోజనాలు నెరవేరాలని నిరంతరాయంగా సరఫరా చేయాలని ఎస్పీడిసిఎల్ అగ్రిమెంట్ చేశారు.ఇప్పుడున్న నీళ్ళు మనం వాడుకునే అవకాశం ఉంది..854 ఎత్తు వరకు పోతిరెడ్డిపాడు,840 వరకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ డ్రా చేస్తుంది.ఈ రోజుకు 124 టీ ఏం సి ల నీళ్ళు ఉన్నాయి.శ్రీశైలం లో ఉన్న నీళ్ళు యాసంగి పంటకు కూడా ఇవ్వొచ్చు.. పాలమూరు జిల్లా బిడ్డ అంటావ్ గా సిగ్గుపడాలి..సి ఎం సొంత ఊరు పరిసర ప్రాంతాల్లో కే ఎల్ ఐ నీళ్ళు రావట్లేదు..ముప్పై మూడు నెలలుగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పెట్టారు.ఫ్యూచర్ సిటీ,అన్నదమ్ముల దందా మీద వున్న శ్రద్ధ రైతులకు నీళ్ళు ఇవ్వడంలో లేదు..మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇలా అన్నారు. ఆంధ్రాకు నీళ్ళు పోతున్నాయి... తెలంగాణకు నీళ్ళు రావట్లేదు..ఆంధ్రా అనధికారికంగా నీళ్ళు తరలించుకుపోతుంది.సీఎం, జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారు.. మోటర్లకు విద్యుత్ సరఫరా చేయడం లేదు. కరెంట్ సాకుతో ఏపీ దోపిడీకి సహకరిస్తున్నారు. గుడిపల్లి మోటర్లు మేము వస్తున్నామని మోటర్లు ఆన్ చేశారు.పంటలు ఎండిపోతే ప్రభుత్వానిదే బాధ్యత.. పాలమూరు ఎడారి కాకుండా కాపాడాల్సిన అవసరం ఉంది.మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ప్రసంగిస్తూరైతులకు నీళ్ళు ఇచ్చే సోయి ప్రభుత్వానికి లేదు.. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడితే ప్రభుత్వం అలెర్ట్ అవుతుంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పాదయాత్ర చేస్తామంటే సీఎం రెండు రోజులు పర్యటించారు. అయినా పనులు ముందుకు సాగడం లేదు.. కేసీఆర్ హయాంలో వరద వచ్చే ముందే అలెర్ట్ చేసేవాళ్ళు... నీళ్ళు వచ్చినా లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం ఆలస్యం చేసింది.. మేము వస్తే మోటర్లు ఆన్ చేశారని రైతులు చెప్తున్నారు.. పంటలు కాపాడాలని ప్రభుత్వానికి సోయి లేదు..ఈ వానాకాలం సాగు మీద ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ఇవ్వలేదు.దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు..రైతులకు సాగు నీళ్ల ఇచ్చే వరకు అండగా ఉంటాం..రైతుల సంక్షేమం,శ్రేయస్సు మాకు ముఖ్యం.. మోటర్లు ఆపకుండా నడపాలి..విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి..మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ పంపులు ఆపకుండా నడపడం లేదన్నారు.ఆంధ్రాకు 15 రోజుల్లో డెబ్బై టీ ఏం సి నీళ్ళు వెళ్ళాయి..మోటర్లకు విద్యుత్ సరఫరా లేకపోవడం దారుణం..రైతులకు నీళ్ళు ఇవ్వాలని ఒక్క ఎమ్మెల్యే అయినా మాట్లాడారా?అధికారులను ప్రభుత్వం బెదిరిస్తుంది..సీఎం సొంత ఊర్లో కరెంట్ లేక రైతులు రోడ్డెక్కారు..కే ఎల్ ఐ మాకు అప్పజెప్పండి. మేము నడిపిస్తాం..సీఎం కరెంట్ బంద్ చేస్తున్నారు.రేపు మీ పవర్ కూడా ప్రజలు కట్ చేస్తారు.ఎమ్మెల్యే లకు రైతుల సంక్షేమం పట్టింపు లేదు.రైతులు అధైర్య పడొద్దు...మీకు అండగా ఉంటాం..మీ పంటలు కాపాడే బాధ్యత మేము తీసుకుంటాం..మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి ప్రసంగంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగం గొంతు కోస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారనే భయంతో మోటర్లు ఆన్ చేశారు.రైతులు మీద ప్రేమ లేదు.సీఎం కిపాలమూరు జిల్లా మీద ప్రేమ ఉంటే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలి. మోటర్లు ఆన్ చేయకుంటే పంప్ హౌస్ ల వద్ద టెంట్ వేసుకొని కూర్చుంటామని ప్రకటించారు.

## భూత్పూర్ సాగు నీటి కాలువ తూములు షెటర్లు
## ధ్వంసం చేసిన వారి పైన చట్ట ప్రకారం చర్య తీసుకోవాలి



(సమయం ప్రతినిధి అమరచింత : అమరచింత మండల పరిధిలోని ధర్మపురం, మస్తిపురం డిస్ట్రిబ్యూటర్ని, తూము సెటర్ని తొలగించి, దానికున్న రాడ్ ఇతర సామాగ్రిని ధ్వంసం చేసిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి ధ్వంసం చేసిన వారితో పాటు పర్యవేక్షణ చేసే లస్కర్ పైన అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత మండల పరిధిలోని ధర్మాపూర్ మస్తి పూర్ సాగునీటి కాలువల తూములను దుండగులు ధ్వంసం చేసిన ప్రదేశాలను రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు పొలాలకు సాగు అందించే లక్ష్యంతో నిర్మాణం చేసిన కాలువలు, వాటి తూములకు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం, ఉన్నత అధికారుల అలసత్వం కారణంగా సాగునీటి కాలువలకు తూములకు రక్షణ లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ ఆయకట్టు చివరి రైతుల పొలాలకు నీళ్లు రాకుండగా కొద్దిమంది విద్రోహ శక్తులు కుట్రలు పన్ని ధర్మాపురం మస్తిపురం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సాగు జలాలను, వాటి కాలువలు తూములు ఇతరత్ర వాటిని రక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. చివరి ఆయకట్టు రైతులు పొలాలకు నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే ఇలాంటి పనులు చేయడం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కాలువల తూములను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని కావున పై సంఘటన పై విచారణ జరిపి ఎంతటి వారు ఉన్న నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమరచింత సిపిఐ రైతు సంఘం నేత కే.లక్ష్మీనారాయణ, రైతులు చిన్న వెంకటరెడ్డి, కోదండ రెడ్డి, మరియు కాలువ లస్కర్ శ్రీనివాసులు, అమరచింత మున్సిపాలిటీ చైర్మన్ జింక సువర్ణ రవి, అమరచింత మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవికాంత్, చెరువు అధ్యక్షులు పి.విష్ణు ,రాఘవేంద్ర,ఎం.శేఖర్,ఆంజనేయులు,రఘు ,సుబ్యా నాయక్, పి.రాము ,ఉప్పరి రంగన్న, భూత్పూర్ కాల్వ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**సెప్టెంబర్ 15న హైదరాబాదులో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి.**
**జోగులాంబ గద్వాల జిల్లా సిపిఐ ఎంఎల్**
**న్యూ డెమొక్రసీ పార్టీ కార్యాలయంలో పోస్టర్స్ ఆవిష్కరణ**
**ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్ మాట్లాడుతూ...**




గద్వాల : హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు, గోదాములు,రైస్ మిల్లులు,సిమెంటు, ఎరువుల గోదాములు, పరిశ్రమలు,ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే వేలాది మంది హమాలీ కార్మికులు నేటికీ చట్టబద్ధమైన హక్కులు,రక్షణ లేకుండా పనిచేస్తున్నారని అన్నారు.హమాలీలు నిత్యం బరువులు మోయడం వల్ల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం హమాలీలకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,చట్టబద్ధమైన హక్కులు,సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,50 సంవత్సరాల వయసు దాటిన హమాలీలకు నెలకు 10వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని,ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెడు రామకృష్ణ పౌలురాజ్ బిసన్న సాయికుమార్ జమ్మిచేడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఇళ్లు ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**బాధితులకు నష్టపరిహారంగా రూ. 30లక్షలు చెల్లించాలి**
**జిల్లా ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కురుమన్న డిమాండ్**

గద్వాల : గద్వాల మండల పరిధిలోని రేపల్లి గ్రామంలో మాదిగ కులానికి చెందిన రంగముని, బీసీ కులానికి చెందిన మహేశ్వరి ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారనే సమాచారంతో జీర్ణించుకోలేని మహేశ్వరి కుటుంబ సభ్యులు దళిత రంగముని ఇంటిపైకి వెళ్లి సుమారు 30-40 మంది ప్రొక్లైన్ ( జేసిబి), గడ్డపారలతో ధ్వంసం చేయడం దుర్మార్గం, ఇళ్లు ధ్వంసం చేసిన బీసీ కులానికి చెందిన వారిని వెంటనే అరెస్టు వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకుని తమ ఇష్ట ప్రకారం కులాంతర వివాహం చేసుకుంటే కుల వివక్షత పేరుతో దాడులు సరికాదని విమర్శించారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే దళితుల ఇళ్లు నేలమట్టం అయ్యేవి కాదని విమర్శించారు. ఇప్పటికైనా పోలీసులు తక్షణం స్పందించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన బాధితులకు 30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని అధికారులను కోరారు. అదేవిధంగా ప్రేమజంటకు మరియు కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని అదేవిధంగా గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా బందోబస్త్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కీసరగుట్టలో భక్తి పరవశం.. శివయ్యకు ఘనంగా అన్నాభిషేకం



వేకువ సమయం సెప్టెంబర్ 11 కీసర ప్రతినిధి: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కీసర డివిజన్ -1 కీసరగుట్టలో శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకుని శ్రీ భవాని శివ దుర్గా సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివనామస్మరణల మధ్య స్వామివారికి తైలాభిషేకం నిర్వహించిన అనంతరం అన్నాభిషేకం ఘనంగా చేపట్టారు. అన్నంతో పరమేశ్వరుడిని అలంకరించి నిర్వహించిన అన్నాభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రావణమాసంలో అమావాస్య సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటే ఆధ్యాత్మిక ప్రశాంతత, శుభఫలాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు, మాజీ చైర్మన్ లు రమేష్ శర్మ, ఉమాపతి శర్మ, నాగలింగం శర్మ, ఆలయ ఈవో కట్ట సుధాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## బీసీల జనాభా లెక్కలు తేల్చాలి..
## కులగణన చేపట్టాలి: మంత్రి వాకిటి శ్రీహరి

**బీసీల రిజర్వేషన్లు దానం కాదు.. హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాట ఫలితం**
**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయలేదు-మంత్రి వాకిటి శ్రీహరి**

హైదరాబాద్: దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు.బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని మంత్రి స్పష్టం చేశారు. 1953లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం 1979లో బి.పి. మండల్ కమిషన్ ఏర్పడి దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో OBCలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసిందని, 1990లో ఆ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు.1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఎాదీజ రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (బీజదీజ) ఏర్పడిందని, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా దానికి రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు. ఎాదీజ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు జస్టిస్ రోహిణి కమిషన్‌ను కూడా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలో సమగ్ర కుల సర్వే చారిత్రక నిర్ణయంతెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.ఎవరు ఎంతమంది ఉన్నారు? వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? రాజకీయంగా వారి వాటా ఎంత? అనే అంశాలను డేటా ఆధారంగా తెలుసుకునేందుకు సమగ్ర కుల సర్వే నిర్వహించామని తెలిపారు."ఇది కేవలం ఒక సర్వే కాదు.. సామాజిక న్యాయానికి పునాది. బీసీల హక్కులకు బలమైన ఆధారం" అని మంత్రి పేర్కొన్నారు."జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్" రాహుల్ గాంధీ నినాదంతో ముందుకుసాగుతున్నాం- మంత్రి వాకిటి శ్రీహరి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్నది సామాజిక సమానత్వమని మంత్రి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన "జిత్నీ ఆబాదీ, ఉత్నా హక్" నినాదం సామాజిక న్యాయానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు.జనాభాలో ఎంత వాటా ఉంటే అవకాశాలు, అధికారంలో అంత వాటా ఉండాలనే స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కేంద్రంలో పన్నెండేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల జనాభా లెక్కలు తేల్చడానికి ఎందుకు వెనుకడుగు వేస్తోందని మంత్రి ప్రశ్నించారు."బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తారు? డేటా లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యం?" అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను స్పష్టంగా చేర్చాలి. బీసీలను లెక్కించాలి.. బీసీలకు న్యాయం చేయాలి" అని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. "కులగణన చేయండి.. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయండి" అని ఆయన కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

# గ్రంథాలయ సెస్ వసూళ్లపై అధికారుల సమీక్ష





వేకువ సమయం సెప్టెంబర్ 11కీసర ప్రతినిధి: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్‌లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ సెస్ వసూళ్లు, పెండింగ్ బకాయిలు, గ్రంథాలయాల అభివృద్ధికి నిధుల సమీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంస్థ కార్యదర్శి పేరం సురేష్‌బాబు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీల వద్ద పెండింగ్‌లో ఉన్న సెస్ బకాయిలను ప్రతి నెల రూ.2 లక్షల చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. జీహెచ్‌ఎంసీ నుంచి గతంలో నెలకు సుమారు రూ.5 లక్షల గ్రంథాలయ సెస్ అందేదని, అయితే ఏప్రిల్ 2026 నుంచి ఇప్పటి వరకు సెస్ అందకపోవడంపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయించేలా సంబంధిత అధికారులకు లేఖలు రాయాలని నిర్ణయించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.4 కోట్ల సెస్ వసూళ్ల లక్ష్యం నిర్దేశించగా, ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా వసూలు కావడంపై సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. మిగిలిన కాలంలో మరింత వేగంగా వసూళ్లు చేపట్టి లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం మున్సిపాలిటీల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్లను కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సెస్ వసూళ్లు, బకాయిలపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. గ్రంథాలయ సెస్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు, అధ్యయన వసతుల కల్పనకు వినియోగించనున్నట్లు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## దేవరకద్ర నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి.

### అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే జిఎంఆర్



(సమయం ప్రతినిధి దేవరకద్ర): బ్రహ్మోస్ ఏర్పాటుతో యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి (GMR) పేర్కొన్నారు శుక్రవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షిస్తూ భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లను తీసుకురావడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు, రాష్ట్ర యువత భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలనే లక్ష్యంతో 70 వేల కోట్లతో డేటా సెంటర్, భారీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. దేవరకద్ర నియోజకవర్గం లో హైదరాబాద్ టు బెంగళూరు జాతీయ రహదారి చీఎ-44 సుమారు 68 కిలోమీటర్ల మేర అనుసంధానమై ఉందని తెలిపారు, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా నియోజకవర్గం సమీపంలోనే ఉందని, జాతీయ రహదారి, ప్రభుత్వ భూముల లభ్యత వంటి అనుకూలతలు ఉన్నందున ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని ముఖ్యమంత్రి ని, పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు, తమరి (శాసనసభ) ద్వారా మరోసారి మంత్రి గారి దృష్టికి తీసుకెళ్తున్నామని తెలియజేశారు. దేవరకద్ర నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉన్నందున ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంతో పాటు స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 415 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారని అన్నారు, ఈ ప్రాజెక్టు నియోజకవర్గానికి రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గం రెండు జాతీయ రహదారులకు అనుసంధానం ఉండటంతో పాటు మూడు రాష్ట్రాలకు అనుకూలమైన భౌగోళిక ప్రాంతంలో నియోజకవర్గం ఉందని, కావున డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు, ఇక్కడ డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. తెలంగాణను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి శ్రీ. శ్రీధర్ బాబు కృషి చేస్తున్న సమయంలో పెట్టుబడిదారులను భయపెట్టేలా లేదా నిరుత్సాహపరిచేలా ఫ్యూచర్ లేని బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రావడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణను ఐటీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే ప్రభుత్వ ప్రయత్నాలకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జియంఆర్ విజ్ఞప్తి చేశారు.

## వినాయకుడి ఆగమనం పేరుతో ట్రాఫిక్ ఇబ్బందులు చేస్తే కఠిన చర్యలు: ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు

గద్వాల పట్టణం:- గద్వాల పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 'గణపతి ఆగమనం' (విగ్రహాల తరలింపు) పేరుతో రహదారులపై సాధారణ ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు హెచ్చరిస్తున్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అదే సమయంలో ప్రజా భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని స్పష్టం చేశారు.ఈ మేరకు ట్రాఫిక్ ఎస్సై తను ట్రాఫిక్ కార్యాలయం నుండి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు ముఖ్యమైన నిబంధనలు మరియు సూచనలు పేర్కొన్నారు.ట్రాఫిక్ అంతరాయంపై నిషేధం: విగ్రహాలను తరలించే సమయంలో రహదారులను పూర్తిగా దిగ్బంధించడం లేదా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం చేయరాదు. రోడ్డు బ్లాక్ చేయొద్దు: అంబేద్కర్ చౌక్, కృష్ణవేణి చౌక్, సుంకులమ్మ మెట్టు ,మెయిన్ రోడ్, నల్లకుంట - రాజీవ్ మార్గ్, బస్టాండ్ రోడ్డులో విగ్రహాల వాహనాలను నిలిపి డ్యాన్సులు చేస్తూ ట్రాఫిక్ జామ్ చేస్తే కేసులు నమోదు చేస్తాం.డీజేలపై ఆంక్షలు: విగ్రహాల ఆగమనం మరియు నిమజ్జనం సమయంలో హై-వాల్యూమ్ డీజేలు (DJ), సౌండ్ వాల్స్ వాడకంపై నిషేధాలు ఉన్నాయి. రోగులు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా నిర్ణీత శబ్ద పరిమితులను పాటించాలి.మండపాల ఏర్పాటుకు అనుమతులు: రహదారుల వెడల్పును దెబ్బతీసేలా, రాకపోకలను అడ్డుకునేలా ఇష్టానుసారంగా మండపాలు ఏర్పాటు చేయకూడదు. ముందస్తుగా తెలంగాణ పోలీస్ పోర్టల్ వంటి అధికారిక మార్గాల ద్వారా అనుమతులు పొందాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం: విగ్రహాల ఊరేగింపుల్లో పాల్గొనేవారు మద్యం సేవించి వాహనాలు నడపడం లేదా హంగామా చేయడం లాంటివి చేస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కఠిన కేసులు నమోదు చేస్తారు. భద్రతా చర్యలు: విద్యుత్ వైర్లకు విగ్రహాలు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద సీసీటీవీ (CCTV) కెమెరాలు మరియు అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అదేవిదంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం (MV Act) మరియు ఇతర శాంతిభద్రతల సెక్షన్ల కింద భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ట్రాఫిక్ ఎస్సై స్పష్టం చేసారు."పండుగను భక్తితో జరుపుకోండి, ప్రజలకు ఇబ్బంది కలిగించకండి. అత్యవసర వాహనాలైన 108, అంబులెన్స్ లకు దారి ఇవ్వండి. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తాం అని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే 112 నెంబర్ కు లేదా గద్వాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయాలని ట్రాఫిక్ ఎస్సై బాల చంద్రుడు కోరారు.

## రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు తగవు!

### హమారా ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలంటూ మంచిర్యాల ఏసిపి కి బీసీ, బహుజన సంఘాల ఫిర్యాదు




(సమయం ప్రతినిధి మంచిర్యాల) : రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్ పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న హైదరాబాద్ వ్యక్తి నాగులారపు అలియాస్ హమారా ప్రసాద్ పై కేసు నమోదు చేయాలని మంచిర్యాల జిల్లా బీసీ, బహుజన సంఘాలు ఫిర్యాదు చేసాయి. మంచిర్యాల అసిస్టెంటు కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రకాశ్ గారికి శుక్రవారం రోజున రాతపూర్వక ఫిర్యాదు అందజేసారు. బిఎన్ఎస్సెస్ సెక్షన్ల ప్రకారం నిందితున్ని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. 1950 కాలంలో రాజ్యాంగ రచన సాగుతున్నపుడే మనువాదులు అడ్డుకుని మనుస్మృతియే ఈ దేశపు రాజ్యాంగం, కొత్త రాజ్యాంగం అవసరం లేదని వాదించారని వారు తెలిపారు. నాడు రాజ్యాంగాన్ని ఒప్పుకోని వాళ్లే నేడు రాజ్యాంగం అమలై మెజార్టీ వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు హక్కులు దఖలు కావడంతో ఇలా రాజ్యాంగ నిర్మాతలను అవమాన పరుస్తున్నారని వారు పేర్కొన్నారు. అంబేద్కర్ పై అవాకులు మాట్లాడుతున్న వారు మనువాదులు విదిల్చే బిచ్చపు మెతుకులకు ఆశపడుతున్న కిరాయి మనుషులేనని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర హోం మంత్రిగా రేవంత్ రెడ్డి తన బాధ్యతలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవులనుభవిస్తున్న వారు రాజ్యాంగ నిర్మాతలకు అవమానం జరుగుతుంటే మౌనమెట్ల వహిస్తారని వారు ప్రశ్నించారు. జరుగుతున్న అవమానం అంబేద్కర్ కు కాదని దేశంలోని మెజార్టీ వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీలను మనువాదులు అవమానిస్తున్నారని తెలిపారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో దివంగత నేతలను కించపరిచే హక్కు ఎవరికీ లేదని వారు పేర్కొన్నారు. సదరు నిందితున్ని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి విపరీత ధోరణులు భవిష్యత్తులో పునరుక్తం కాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు దేవి పోచయ్య, సామాజిక ఉద్యమకారులు మోతె రామదాసు, కైలాసం, షబ్బీర్ పాషా, పాటి రాజు, బుస్స యాదగిరి, అన్నం రమేష్, సముద్రాల బుచ్చన్న, మొగిలి తిరుపతి, శ్రీమన్నారాయణ, సమ్మ రాజయ్య, ప్రేమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

(సమయం ప్రతినిధి అమరచింత) : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖ మంత్ర డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగాలి, TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు, నందిమల్ల క్యాంప్‌లోని మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ ఇన్‌టేక్ వెల్ మోటార్ కాలిపోవడంతో గత 5 రోజులుగా 12 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని RWS ఎస్ఈ శ్రీ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏజెన్సీ వారితో మాట్లాడి కొత్త మోటార్‌ను వెంటనే పంపించారు. ఈరోజు సాయంత్రంలోపు మోటార్‌ను అమర్చించి నీటి పంపింగ్ ప్రారంభిస్తామని తెలిపారు."ప్రజల సమస్యే మా సమస్య.. పరిష్కారం చూపించడమే మా బాధ్యత." "తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో తక్షణ చర్యలు." "ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడమే ప్రజా పాలన లక్ష్యం.""సమస్య తెలిసిన వెంటనే స్పందన.. పరిష్కారం అయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ తమ అభిమతం అని మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో RWS DE శేషగిరిరావు, RWS గ్రిడ్ AE మహేష్ , RWS ఇంట్రా AE చెన్నయ్య, ఆపరేటర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు & నందిమల్ల సర్పంచ్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మొదలైనచోటే ముగిసిన వివాదం!

సమయం ప్రతినిధి : హైదరాబాద్ నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల వివాదం సుప్రీంకోర్టులో మొదలై అక్కడే ముగిసింది. లా విద్యార్థుల మీద, టీచింగ్ సిబ్బంది మీద క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు లేదని సుప్రీంకోర్టు సెప్టెంబరు 3న తీర్పు చెప్పింది. సెప్టెంబరులో జరగాల్సిన నల్సార్ లా యూనివర్సిటీ కాన్వొకేషన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించారు. ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా పట్టాలు తీసుకోవడం న్యాయశాస్త్ర విద్యార్థులకు గొప్ప అవకాశం. కానీ నల్సార్ విద్యార్థులు దానికి అభ్యంతరం చెప్పారు. జస్టిస్ సూర్యకాంత్‌కు రాజ్యాంగ ప్రధాన విలువల మీద గౌరవం లేదనీ, అలాంటివారి చేతుల మీదుగా తాము పట్టాలు తీసుకోబోమనీ అన్నారు. దీంతో యూనివర్సిటీ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించే ఆలోచనను విరమించుకుంది. కానీ, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు వ్యతిరేకంగా విద్యార్థులు నిరసనలు తెలపడం పట్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) తీవ్రంగా స్పందించింది. ఈ ఏడాది నల్సార్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రులైన వారిని దేశంలో ఏ బార్ అసోసియేషన్?లోనూ నమోదు చేసుకోరాదని బీసీఐ అధ్యక్షులు మానన్ కుమార్ మిశ్రా తీవ్రమైన ఉత్తర్వు జారీచేశారు. మానన్‌కుమార్ మిశ్రా బీజేపీకి సన్నిహితులు. బీసీఐ అధ్యక్ష పదవిలో పదేళ్లుగా నిరాఘాటంగా కొనసాగుతున్న వారు. రెండేళ్ల క్రితం బిహార్ నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభకు కూడా ఎన్నికయ్యారు. జస్టిస్ సూర్యకాంత్ పరువును కాపాడే లక్ష్యంతో మానన్‌కుమార్ మిశ్రా ఈ వినూత్న ఉత్తర్వులు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ ఉత్తర్వులు రాగానే, సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్‌తో సహా, దేశంలోని ప్రజాస్వామికవాదులంతా మానన్‌కుమార్ మిశ్రా నిర్ణయం మీద తీవ్రంగా స్పందించారు. నిరసనలు పెరగటంతో బీసీఐ తన ఉత్తర్వుల్ని ఉపసంహరించుకుంది. అయినప్పటికీ ఆ వివాదం ముగియకుండా మరికొన్ని ఆసక్తికర మలుపులు తిరిగింది. నల్సార్ యూనివర్సిటీ పూర్వవిద్యార్థులు మిహిరా సూద్, అభిషేక్ తివారీ బీసీఐ తీరుపైన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీనియర్ అడ్వకేట్ పరమేశ్వర్ విద్యార్థుల కేసును వాదించారు. ఈ కేసు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనానికే వెళ్లింది. ఇక్కడే ఈ కేసు కొత్త మలుపు తిరిగింది.ఇది నల్సార్ యూనివర్సిటీ కేసు అని చాలా మంది అనుకుంటున్నారు. కానీ, ఈ కేసు అసలు సుప్రీంకోర్టులోనే ఆరంభం అయ్యి, తిరిగి సుప్రీంకోర్టుకే వచ్చింది. ఈ ఏడాది మేలో ఒక కేసు విషయమై సుప్రీంకోర్టుకు వచ్చిన సమాచార హక్కు కార్యకర్తలను సీజేఐ 'బొద్దింక'లంటూ కసురుకున్నారు. ఆ విసుర్లనే ఆత్మగౌరవంగా భావించి, బొద్దింకల ఉద్యమం మొదలయ్యింది. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా, కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుతో, యువతరం ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరసనలు చేపట్టింది. నిరసనకారుల మీద లాఠీలతో విరుచుకుపడితే ఈ ఉద్యమం ఆగిపోతుందని కేంద్ర ప్రభుత్వం భావించింది. విద్యార్థుల మీద తీవ్రంగా లాఠీచార్జి జరిగింది. కానీ, లాఠీ కర్రకు మేకులు దించి కొట్టారు! సంప్రదాయ నిర్వచనం ప్రకారం అది లాఠీచార్జి కాదు; మేకులు దించడం. ఆపైన తుపాకుల్లో పెల్లెట్లు పెట్టి కాల్పులు జరిపారు.నిజానికి ఇలాంటి దురంతాలు జరిగినప్పుడు భారత ఉన్నత న్యాయస్థానం సుమోటోగా స్పందించవచ్చు. అలా జరగలేదు. పైగా, పోలీసుల వ్యవహార శైలి మీద స్పందించాలని కొందరు అడ్వకేట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించి లాఠీచార్జికి సంబంధించిన వీడియోలను పరిశీలించమన్నప్పుడు సీజేఐ అసహనాన్ని వ్యక్తం చేశారు. తన సమయాన్ని వృథా చేయవద్దని మందలించారు. ఈ వార్త వైరల్ అయ్యింది. జెన్‌జీకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి దానికి ముందున్న తరాలు జెన్ వై, జెన్ ఎక్స్ కూడా నిరసనలకు మద్దతుగా వచ్చాయి. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పలేదు. 'ఉన్నత న్యాయమూర్తులకు పదవీ విరమణానంతరం నామినేటెడ్ పదవులు ఇవ్వరాదు' అన్న డిమాండును బొద్దింకల ఉద్యమం ముందుకు తెచ్చింది. ఎవరిని ఉద్దేశించి ఈ డిమాండు పుట్టిందో తెలియనివారుండరు. ఇన్ని మెలికలు తిరిగిన నల్సార్ కేసు చివరకు అదే సీజేఐ ధర్మాసనానికే వచ్చింది.





# పంటలు ఎండిపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తాం



## -గుడిపల్లి రిజర్వాయర్ను సందర్శించిన మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు

**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) :** నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి రిజర్వాయర్ వద్ద మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (KLIS) స్టేజ్-3 పంప్‌హౌస్‌ను మాజీ మంత్రులు వి శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, సి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం నాడు పరిశీలించారు. మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇలా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు పోతున్నా మోటార్లు ఆన్ అవడం లేదు. ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకే ఈ పర్యటన చేపట్టాం. పాలమూరు రిజర్వాయర్లు పూర్తయ్యాయి. వాటిని మాత్రం నింపడం లేదు. ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయి. మరో 10 శాతం పనులు పూర్తి చేస్తే రైతుల పొలాల్లోకి నీరు వెళ్లే అవకాశం ఉంది. టెండర్లను రద్దు చేసి పనులను ముందుకు తీసుకెళ్లడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు శ్రీశైలం నుంచి 37 టీఎంసీల నీరు వెళ్లినట్లు అధికారికంగా చెబుతున్నారు. కానీ వాస్తవంగా వెళ్లింది 70 టీఎంసీల నీరు. తెలంగాణకు మాత్రం 7 టీఎంసీల లోపే నీరు వచ్చింది. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్లు? ఎల్లూరులో ఐదు మోటార్లు నడవాల్సి ఉండగా రెండు మాత్రమే నడుస్తున్నాయి. జొన్నలబోగడ వద్ద ఐదు మోటార్లు ఉంటే ఒకటి, రెండు మాత్రమే నడుస్తున్నాయి. గుడిపల్లి వద్ద ఐదు మోటార్లు ఉంటే ఒకటి, రెండు మాత్రమే నడుస్తున్నాయి. రాత్రి సమయంలో కాకుండా కేవలం పగటి పూట మాత్రమే మోటార్లు నడుపుతున్నారు. కరెంటు రావడం లేదనే కారణంతో మోటార్లు నడపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తీసుకెళ్లేందుకు కరెంటును సాకుగా చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన ఆదిత్యనాథ్ ప్రణాళిక ప్రకారం ఇలా చేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో ఉన్న వారికి నీరు లేదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని పెన్నా బేసిన్‌లో ఉన్న పొలాలకు కృష్ణా నీటిని తీసుకెళ్తున్నారు. ముచ్చిమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణకు రావాల్సిన 50 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించారు. వరద జలాల కోసం నిర్మించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా 8 వేల క్యూసెక్కుల నికర జలాలు పోతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మాత్రం అసలు స్పందించడం లేదు. కేఎల్ఐ ప్రాజెక్టులోని చిన్న మోటార్లకు కరెంటు లేదని రాత్రివేళల్లో మోటార్లు నడపడం లేదు. మరి పాలమూరు ప్రాజెక్టులో ఉన్న మోటార్లకు కరెంటు ఇచ్చి ప్రారంభిస్తారా? ప్రభుత్వం రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. యూరియా ఇవ్వడం లేదు, కరెంటు ఇవ్వడం లేదు, సాగునీరు ఇవ్వడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల బృందం గుడిపల్లి వద్దకు వస్తుండటంతో రెండో మోటార్‌ను ఆన్ చేశారు. రైతుల పక్షాన పోరాటం చేసేందుకు కేసీఆర్ వస్తున్నారు. పంటలు ఎండిపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు







## నా పట్టు - నా అభిమానం 2.0

మహబూబాబాద్ సెప్టెంబర్ 11 (వేకువ సమయం ప్రతినిధి): జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ, మల్బరీ సాగుతో రెండు లక్షల నికర ఆదాయం (నా పట్టు - నా అభిమానం 2.0) నూతన రైతులకు మల్బరీ సాగు లాభదాయకం పంట మార్పిడితో ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో అధిక ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగు చేయాలి. కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా లో మల్బరీ సాగు విస్తీర్ణం ను పెంచే క్రమంలో నా పట్టు - నా అభిమానం కార్యక్రమాన్ని G.అనసూయ, జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్ శాఖ వారి ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సిల్క్ బోర్డు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముఖ్య అతిథి మైసూర్ శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్, మల్బరీ సాగు గురించి రైతులకు పలు సాంకేతిక సలహాలు ఇస్తూ పలు సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతాంగం పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేపట్టి ఎకరానికి 2 లక్షల ఆదాయం పొందాలని తెలిపారు. ఈ పంట ఆదాయం సాఫ్ట్వేర్ ఇంజనీర్ జీతం తో సమానం అని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో సామూహికంగా మల్బరీ సాగు చేపట్టాలని దీనికి కోతులు, దొంగల బెడద లేదని, ఒక సంవత్సరం లో 5 నుండి 6 పంటలు తీసుకోవచ్చని ఎక్కువ స్థాయిలో ఎరువులు అవసరం లేదని, పురుగు మందులు అసలు అవసరం లేదని తెలుపుతు ఈ సాగు వైపు మొగ్గుచూపాలని తెలిపారు. వరి, మొక్కజొన్న, ప్రత్తి, మిరప సాగు విస్తీర్ణం తగ్గించి ఈ మల్బరీ పంటని సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న ఈ పంట సాగు వలన పరిశ్రమలు స్థాపించి యువతకు, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉపాదిని కల్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనుక రైతాంగం ఆలోచించి పంట మార్పిడి ద్వారా మల్బరీ సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో G.అనసూయ జాయింట్ డైరెక్టర్, సీరికల్చర్, జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి, శ్రీకాంత్, కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్త, కె.సురేష్ , సెరికల్చర్ అధికారి, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 11 (వేకువ సమయం ప్రతినిధి): సమగ్ర శిక్ష - సమ్మిళిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్) విభాగం ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణ కేంద్రం లోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు ఒకరోజు జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి . రాజ్ కృష్ణ హాజరై ప్రసంగించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నల్సా అమలు చేస్తున్నటువంటి “మానసిక మరియు మేధోపరమైన వైకల్యాలు కలిగిన వారికి ఉచిత న్యాయ సహాయ పథకం” పలు సంక్షేమ పథకాలు, బాలల హక్కుల పరిరక్షణ చట్టాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. చట్టప్రకారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు దివ్యాంగులందరికీ ఉచిత న్యాయ సహాయం పొందే పూర్తి హక్కు ఉందని స్పష్టం చేశారు. న్యాయపరమైన సలహాలు, సమస్యలు లేదా న్యాయ సహాయం కొరకు నల్సా జాతీయ ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 15100 ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజర్ వి. సురేష్, జిల్లా సైన్స్ అధికారి ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి ఎం. శ్రీరాములు , సిబ్బంది మరియు వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం సమీపంలో చెత్త దహనం.. పొగతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

అమరచింత : మున్సిపాలిటీ పరిధిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న చేనేత సహకార సంఘం సమీపంలో చెత్తను వేయడంతో పాటు దహనం చేయడం వల్ల దట్టమైన పొగ వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేనేత సహకార సంఘంలో ప్రతిరోజూ సుమారు 30 మంది కార్మికులు పని చేస్తుండగా, చెత్త నుంచి వెలువడుతున్న పొగతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అదే విధంగా ఈ ప్రాంతం ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులు కూడా పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఇక్కడే వేయడం, దహనం చేయడం వల్ల భవిష్యత్తులో కూడా పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెత్త కుప్పకు సమీపంలో నీటి కుంట ఉండటంతో, చెత్త నుంచి వెలువడే వ్యర్థాలు నీటిలో కలిసే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమై ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫ్లోరైడ్ వ్యాధులు తప్పనిసరిగా వస్తాయని చెప్పలేం; నీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహించడం అవసరం. ఈ సమస్యతో పక్కనే ఉన్న విద్యుత్ సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమీపంలో చెత్తను పేరుకుపోయేలా చేయడం, దహనం చేయడం వల్ల భద్రతపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలు, చేనేత కార్మికులు, విద్యుత్ సిబ్బంది ఆరోగ్యం మరియు భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో చెత్త వేయడం, చెత్తను దహనం చేయడం వెంటనే నిలిపివేయాలని, మున్సిపాలిటీ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా తగిన ప్రదేశంలో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేసి అక్కడికి తరలించాలని అమరచింత ప్రజలు కోరుతున్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ భద్రతను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతాంగం మిషన్ వైవిధ్యం - పంట మార్పిడి ద్వారా రోజువారి అవసరము ఉండే కూరగాయల సాగు చేయాలి.

## కూరగాయ చిరు సంచుల క్షేత్రాల సందర్శన



మహబూబాబాద్ సెప్టెంబర్ 11 ( వేకువ సమయం ప్రతినిధి): జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఐఏఎస్ ఆదేశాలు ప్రకారం సమావేషి ఆజావిక యోజన పథకం కింద ఇచ్చిన కూరగాయలు చిరు సంచుల క్షేత్రాలను శుక్రవారం గంగారం మండలంలో జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న ఐకెపి ఎపిఎం ఎస్ ఉపేంద్ర తో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆస్పిరేషన్ బ్లాక్ ప్రతినిధీ శ్రీనాథ్, స్వయం సహాయక మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేకువ సమయం
శనివారం 12 సెప్టెంబర్ 2026





# పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆహార నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ కమిషన్ కొరడా

వేకువ సమయం సెప్టెంబర్ 11 కీసర ప్రతినిధి: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు.. విద్యార్థుల ఫిర్యాదులతో అధికారులకు ఆదేశాలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాలో కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతితో కలిసి ఆయన పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, చౌకధరల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేడ్చల్‌లోని చౌకధరల దుకాణాలను పరిశీలించిన కమిషన్ స్టాక్, రిజిస్టర్లను తనిఖీ చేసింది. దుకాణాల వద్ద ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయడంతో పాటు జిల్లా సివిల్ సప్లై అధికారి, తహసీల్దార్ల ఫోన్ నంబర్లను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించింది. సన్న బియ్యం సరఫరా, పంపిణీపై వినియోగదారులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కిష్టాపూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించిన కమిషన్ అధికారులు ఆహార పదార్థాల గడువు తేదీలను తనిఖీ చేశారు. నాణ్యమైన సన్నబియ్యాన్నే వినియోగించాలని, నాణ్యతలో లోపాలుంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉడికించిన గుడ్ల రంగు మారడంపై అనుమానం వ్యక్తం చేసి, నమూనాలను సేకరించి ఫుడ్ సేఫ్టీ అధికారులు పరీక్షలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య రిజిస్టర్లను పరిశీలించిన కమిషన్.. రక్తహీనత ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించింది. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో భోజనం, అల్పాహారం, స్నాక్స్ మెనూ ప్రకారం అందుతున్నాయా? తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే విషయాలను తెలుసుకున్నారు. దమ్మాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో లంచ్ బాక్సులు తెచ్చుకోవడాన్ని కమిషన్ గమనించింది. ఇంటి నుంచి భోజనం ఎందుకు తెచ్చుకుంటున్నారని ప్రశ్నించగా.. పాఠశాలలో భోజనం సరిగా ఉండటం లేదని విద్యార్థులు కమిషన్‌కు తెలిపారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కమిషన్ సభ్యులు, ఇలాంటి లోపాలను ఉపేక్షించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టం చేస్తూ.. తిరిగి వచ్చి పరిస్థితులను పరిశీలిస్తామని హెచ్చరించారు. అనంతరం దమ్మాయిగూడ అంబేద్కర్‌నగర్, జవహర్‌నగర్, మల్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారుల సంఖ్య, వారికి అందుతున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితరాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజన మెనూను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. గర్భిణులు, 14 ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందుకోవడం చట్టబద్ధమైన హక్కు అని గోలి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ హక్కు అమలులో ఎక్కడైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు కమిషన్ సభ్యులు తమ ఫోన్ నంబర్లను అందజేశారు. ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, సంక్షేమ శాఖ అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్‌ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిని కూల్చడం అనాగరిక చర్య
## ఘటనపై పోలీసు అధికారులు త్వరితగతిన విచారణ చేపట్టాలి



జోగులాంబ గద్వాల): దళితుల ఇంటిని కూల్చడం అనాగరిక చర్య అని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మణికుమార్ అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఆయన గద్వాల మండలం రేపల్లెలో కూల్చిన దళితుల ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత సమస్యలను దృష్టిలో పెట్టుకుని దళితుల ఇంటిపై దాడి చేసి అత్యాధునిక వాహనం సహాయంతో ఇంటిని కూల్చివేయడం హేయమైన చర్య అని అన్నారు. ఘటనపై పోలీసు అధికారులు త్వరితగతిన విచారణ చేపట్టాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇంటి కూల్చిన నిందితులపై కఠిన శిక్షను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కుటుంబానికి నష్టపరిహారంతో పాటు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వము ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసి.. నిర్మించేటట్లు చర్యలు తీసుకోవాలి.

## వాహనం అమ్మారా..
## ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ తప్పనిసరి!

**వాహనం అమ్మిన తర్వాత ట్రాన్స్‌ఫర్ చేయించుకోకపోతే చట్టపరమైన ఇబ్బందులు తప్పవు**



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 11 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా వాహన యజమానులు తమ వాహనాలను ఇతరులకు విక్రయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. వాహనం విక్రయించిన తర్వాత కేవలం తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకోవడం మాత్రమే కాకుండా, సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో యాజమాన్య బదిలీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని తెలిపారు. ఇటీవల (గౌతమ్) పేరు మార్చాము అనే వ్యక్తి ఆటోను ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసి, కొంతకాలం తర్వాత ఈఎంఐలు చెల్లించలేక మరో వ్యక్తికి విక్రయించాడు. అయితే వాహనం విక్రయించే సమయంలో కేవలం తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకున్నారు. వాహనం ఆర్టీఏ రికార్డుల్లో మాత్రం గౌతమ్ పేరుమీదే కొనసాగింది. తర్వాత ఆ ఆటోలో గంజాయి తరలిస్తుండగా భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీఏ రికార్డుల ప్రకారం వాహనం యజమాని గౌతమ్ పేరుమీద ఉండటంతో ఆయన పోలీసు కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మరోవైపు వాహనం ఫైనాన్స్‌లో ఉండటంతో పెండింగ్‌లో ఉన్న ఈఎంఐలు చెల్లించాలంటూ ఫైనాన్స్ సంస్థ నుంచి కూడా ఒత్తిడి ఎదురైంది. ఈ ఘటన వాహనం విక్రయించే ప్రతి ఒక్కరికీ ఒక హెచ్చరిక వంటిదని శంకర్ నాయక్ పేర్కొన్నారు. వాహనం అమ్మిన తర్వాత కొనుగోలుదారుడి పేరుమీద యాజమాన్య బదిలీ జరిగిందా లేదా అనే విషయాన్ని విక్రయించిన వ్యక్తి స్వయంగా నిర్ధారించుకోవాలని సూచించారు. వాహనం కొనుగోలు చేసిన వ్యక్తి ప్రమాదానికి గురిచేసినా, నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించినా లేదా ఇతర చట్టపరమైన సమస్యల్లో చిక్కుకున్నా, ఆర్టీఏ రికార్డుల్లో వాహనం పాత యజమాని పేరుమీదే ఉంటే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

**వాహన యజమానులకు విజ్ఞప్తి:**

వాహనాన్ని ఎవరికైనా విక్రయించినప్పుడు కేవలం అగ్రిమెంట్ చేసుకోవడం లేదా డబ్బు తీసుకోవడంతో బాధ్యత పూర్తయిందని భావించకుండా, సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో యాజమాన్య బదిలీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి. రికార్డుల్లో కొత్త యజమాని పేరు నమోదైనట్లు నిర్ధారించుకున్న తర్వాతే విక్రయ ప్రక్రియ పూర్తయిందని భావించాలని శంకర్ నాయక్ సూచించారు.

## జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పర్యావరణహిత మట్టి గణపతి
## ప్రతిమల పంపిణీ : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్



మహబూబాబాద్, సెప్టెంబర్.11 (వేకువ సమయం ప్రతినిధి : శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణలో మట్టి గణపతి ప్రతిమలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా, రసాయన రహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రమాదకర రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి విగ్రహాలనే పూజించి నీటి మూలాలను, పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్లాస్టిక్, రసాయన విగ్రహాల వాడకాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయి శ్రీజ, డి.పి.ఆర్.ఓ రాజేంద్రప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర కీలకమైనది



వేకువ సమయం// మంచిర్యాల,సెప్టెంబర్ 11, 2026 : అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం గాంధారి వనం ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి హాజరై అటవీ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతంపై పడుతుందని, ఈ క్రమంలో అడవులు, పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారులు విశిష్ట కృషి చేస్తారని తెలిపారు. ఆదివాసి గిరిజనుల హక్కులను కాపాడుతూనే అటవీ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అడవులను రక్షించడం ద్వారా భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం జరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అందించినట్లు అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా అటవీ అధికారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది సైతం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జిల్లా కలెక్టర్ ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్ట ఆలయ చరిత్ర, వాస్తు విశేషాలపై సమగ్ర అధ్యయనానికి పురావస్తు శాఖ దృష్టి సారించింది



వేకువ సమయం సెప్టెంబర్ 11 కీసర ప్రతినిధి:కీసరగుట్ట చరిత్రకు కొత్త అధ్యాయం!ఆలయ చారిత్రక, వాస్తు, శాసన విశేషాలపై అధ్యయనంతెలంగాణ హెరిటేజ్ అండ్ ఆర్కియాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పరిశీలనఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా అపారమైన చారిత్రక, పురావస్తు ప్రాధాన్యత కలిగిన కీసరగుట్ట శ్రీ భవాని శివదుర్గ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ చరిత్ర, నిర్మాణ శైలి, శాసనాలు, వాస్తు విశేషాలపై తెలంగాణ హెరిటేజ్ అండ్ ఆర్కియాలజీ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా తెలంగాణ వారసత్వ, వాస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి శుక్రవారం కీసరగుట్ట ఆలయాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.స్వామివారి దర్శనం అనంతరం ఆలయ పరిసరాల్లోని పురాతన శివలింగాలు, ప్రాచీన కట్టడాలు, అక్కన్న–-మాదన్నల కాలానికి చెందినవిగా పేర్కొనే స్వాగత ద్వారాలు, ఆలయ దిగువన ఉద్యానవనం సమీపంలో పురావస్తు శాఖ తవ్వకాల్లో వెలుగులోకి వచ్చిన ప్రాచీన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా అక్కడ బయటపడిన విష్ణుకుండినుల కాలం నాటి కట్టడాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.శాసనాలు.. నిర్మాణ శైలి.. చారిత్రక ఆధారాల పరిశీలన

ఆలయానికి సంబంధించిన శాసనాలు, నిర్మాణ శైలి, వాస్తు విశేషాలు, లయ నిర్మాణ స్వరూపం, చారిత్రక నేపథ్యం, నిర్మాణ కాలం తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కీసరగుట్టకు సంబంధించిన పురావస్తు, చారిత్రక ఆధారాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆలయ చరిత్రకు సంబంధించి మరింత స్పష్టమైన సమాచారాన్ని వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ఈ పర్యటన మరోసారి ముందుకు తెచ్చింది.

# గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి : జిల్లా ఎస్పీ





**గణపతి మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**
**గణేష్ ఉత్సవాల లో అధిక శబ్దం వచ్చే డీజే లకు అనుమతులు లేవు**
**ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు.**
**గణపతి మండప నిర్వాహక సభ్యులు, వివిధ మతపెద్దలతో సమన్వయ సమావేశం**

**వనపర్తి సెప్టెంబర్ -11:** శుక్రవారం రోజు సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల పట్టణాల, గ్రామాల వినాయక మండప నిర్వహకులు , హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ముఖ్యఅతిథిగా పాల్గొని మండప నిర్వహణ కమిటీలు సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ గణపతి విగ్రహాల ఏర్పాటు ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ పట్టణాలలో గ్రామాలలో కలిసి మెలిసి సోదర భావంతో నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని మండప నిర్వహణ కమిటీ సభ్యులను ఉద్దేశించి పలు సూచనలు ఆన్లైన్లో వచ్చిన https://policeportal.tspolice.gov.in లింకు ద్వారా ప్రతి ఒక్క గణపతి మండపం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీని ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలలో చేయవలసిన బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది నిమర్జనం ఏర్పాట్లకు మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వంగా భారతదేశం విరజిల్లుతున్నదని, ఒక మతాన్ని ఇంకో మతం వారిని ఆదరించుకుంటూ పండుగలు జరుపుకునే సంస్కృతి మన వనపర్తి జిల్లాలో ఉన్నదని, అన్ని మతాల సారం ఒక్కటేనని తెలిపారు. రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇతర మతస్తులను గౌరవిస్తూ తమ పండుగలు శాంతి యుతంగా జరుపుకోవాలని, ఇలాంటి సమయాల్లో ప్రజలు తమ ఐక్యతను చాటుకోవాలని వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ తెలిపారు. పండుగను ప్రజలంతా తమ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు అవసరం అనుకున్న ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని అందుకు ప్రజలంతా పోలీసువారికి పూర్తి సహకారం అందించాలని తెలిపారు. పండుగల సమయంలో అక్కడ అక్కడ ఏమైనా చిన్న సంఘటన జరుగుతాయని తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే అలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా వివిధ కులాల మత పెద్దలు, మసీదులు, దేవాలయాలు, చర్చ్ ల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు, ర్యాలీలు సభలు సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మతాల ప్రజలు పరస్పర సహకారంతో పండుగలను నిర్వహించుకుంటూ వస్తున్నారని, ఇదే స్ఫూర్తితో గణేష్ నవరాత్రి ఉత్సవాలను కూడా సామరస్యపూర్వకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ మరియు ఇతర శాఖలకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు.

**గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారికి వనపర్తి జిల్లా పోలీసుల సూచనలు**

- గణేశుని మండపాల వద్ద 24 గంటలు కనీసం ఇద్దరు వాలంటీర్లు విగ్రహంతో పాటు ఉండాలి. జంతువులు మరియు కోతులు లోనికి రాకుండా చూసుకోవాలి.
- గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలి.
- గణేశుని మండపాల వద్దకు మద్యం సేవించి రాకుండా కమిటీ నిర్వాహకులు చూసుకోవాలి.
- మండపాల వద్ద ఎలాంటి టపాకాయలు కాల్చారాదు

గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుందని,ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ https://policeportal.tspolice.gov.in ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

- దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు.
- గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి.
- వృద్ధులు,చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు.
- గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేసుకోవాలి
- విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి,పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ ,వీరారెడ్డి , వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, ఓ డి, రమేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, జిల్లాలోని ఎస్సైలు పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ మతాల కుల పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు, పెద్దలు మరియు జిల్లాలోని యువకులు కార్యాలయ సిబ్బంది పోలీసు అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాపై మూడో కన్ను..
## 2,221 సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా వ్యవస్థ జిల్లా ఎస్పీ




వనపర్తి : ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా, నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు సిసి కెమెరాలు ఇతరులను ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఆదేశాల మేరకు, వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., గారి ప్రత్యేక చొరవతో జిల్లా వ్యాప్తంగా నేనుసైతం, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు,ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు మరియు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 412 నూతన సీసీ కెమెరాలతో పాటు, మరమ్మతులు చేయించిన పాత కెమెరాలను కలుపుకుని మొత్తం 2,221 ఆధునిక సీసీ కెమెరాల వ్యవస్థను శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ప్రారంభించారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిత్యం నిఘా కొనసాగనుంది. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయడం వల్ల అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు, నేరాలకు సంబంధించిన ఘటనలను గుర్తించడంలో, నేరాలు జరిగినప్పుడు ఆధారాలను సేకరించడంలో, నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించనున్నాయని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీగారు మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో కీలకమని అన్నారు. పోలీసులు, ప్రజలు కలిసి పనిచేసినప్పుడే నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టగలమని సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించడం ద్వారా "స్మార్ట్ పోలీసింగ్ – సేఫ్ వనపర్తి" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. జిల్లాలోని ప్రతి ముఖ్యమైన ప్రాంతం పోలీసుల నిఘా పరిధిలోకి వచ్చేలా దశలవారీగా సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సీసీ కెమెరాల ద్వారా లభించే దృశ్యాలు నేరాల దర్యాప్తులో కీలక ఆధారాలుగా ఉపయోగపడటమే కాకుండా, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, గొడవలు, అనుమానాస్పద కదలికలు తదితర ఘటనలపై వేగంగా స్పందించేందుకు పోలీసులకు ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించిన దాతలు, వ్యాపారవేత్తలు, సంస్థల ప్రతినిధులు ప్రజలకు ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదు.. సమాజం మొత్తం బాధ్యత. తమ సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన దాతలు ప్రజా భద్రత పట్ల తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. వారి సహకారం అభినందనీయం, ఆదర్శనీయం. ప్రజల భద్రత కోసం అందించిన ప్రతి సహకారం వనపర్తి జిల్లాను మరింత సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దడంలో విలువైన భాగస్వామ్యమని ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను జిల్లా ఎస్పీ శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవాభావాన్ని అభినందించారు. ప్రజల రక్షణ కోసం భవిష్యత్తులోనూ ఇలాంటి సామాజిక భాగస్వామ్యం కొనసాగాలని ప్రతి గ్రామం, పట్టణం సురక్షితంగా ఉండేందుకు ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా భావించి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## జీవో నంబర్ 97పై అసెంబ్లీ వేదికగా మంత్రి వివేక్ కీలక ప్రకటన..

హైదరాబాద్: పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు జీవో నంబర్ 97పై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించడంతో పాటు వారి భవిష్యత్తుకు పూర్తి రక్షణ కల్పిస్తామని అసెంబ్లీ వేదికగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీవో 97లో అవసరమైన మార్పులు, చేర్పులు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు కె.కేశవరావు కమిటీ సభ్యులతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు మేలు జరిగేలా జీవోలో మార్పులు తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఈసెట్ పరీక్ష ఉంటుందని, దీనిపై ఎలాంటి అపోహలు అవసరం లేదని మంత్రి వివేక్ తెలిపారు. ఫీజులు పెరుగుతాయంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు ప్రైవేటు ఉద్యోగులుగా మారుతారనే ఆందోళనా అవసరం లేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల హోదా కొనసాగుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలల భూములను ప్రభుత్వం విక్రయిస్తుందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్నీ ఆయన ఖండించారు. పాలిటెక్నిక్ కళాశాలలను మోడల్ సంస్థలుగా తీర్చిదిద్దుతున్నామని, వాటిని స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేశామని మంత్రి చెప్పారు.

## కౌలు రైతుల గుర్తింపును వెంటనే ప్రారంభించాలి.
## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు - సంక్షేమ పథకాలు అందజేయాలి.




సమయం ప్రతినిధి : 2011 కౌలు దారుల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఈరోజు తేదీ 11- 9- 2026న సంయుక్త కిసాన్ మోర్చా తో ప్రజా సంఘాలతో కలిసి ఉమ్మడిగా హైదరాబాద్లోని బషీర్ బాబు ప్రెస్ క్లబ్ లో విలేకర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. కేబినెట్ సబ్ కమిటీ కాలయాపన చేయకుండా కౌలు రైతుల గుర్తింపును ఆలస్యం చేయకుండా ఈ ఖరీఫ్ లోగా సత్వర చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజా సంఘాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు రైతు స్వరాజ్ వేదిక కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టీ సాగర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి బి భాస్కర్,DBF శంకర్, AIKMS చంద్రారెడ్డి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, కొండల్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెంటనే కౌలు రైతులను గుర్తించి, ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మానవత్వం చాటుకున్న సీఐ అంజలి



మహబూబాబాద్ సెప్టెంబర్ 11 (వేకువ సమయం ప్రతినిధి): ఈరోజు మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక రామాలయం లైన్ అండర్ బ్రిడ్జి (మునిపున్న శటర్స్ ) పక్కన అకస్మాత్తుగా మంటలు అంటుకోవడంతో విధి నిర్వహణ నిమిత్తం అటువైపు నుండి వెళుతున్న ఇంచార్జ్ టౌన్ సిఐ అంజలి తన సిబ్బంది తో తక్షణమే స్పందించి నీళ్లు తీసుకొచ్చి మంటలు ఆర్పడం జరిగింది. దీనితో పెను ప్రమాదం తప్పిందని ప్రజలు అంటున్నారు.

## అంధ వృద్ధ దంపతులకు ప్రభుత్వ సాయం

**రోడ్డు పక్కన దుర్భర జీవితం.. స్పందించిన సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్**

వేకువ సమయం సెప్టెంబర్ 11 కీసర ప్రతినిధి: అంకిరెడ్డిపల్లి: కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఇల్లు లేకుండా, ఆధార్, ఓటర్ కార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు వంటి కనీస గుర్తింపు పత్రాలు లేక రోడ్డు పక్కన దుర్భర జీవితం గడుపుతున్న అంధ వృద్ధ దంపతులకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ తెలిపారు. అంకిరెడ్డిపల్లికి చెందిన సుమారు 85 ఏళ్ల ఏ. స్వామి అంధుడు కాగా, ఆయన భార్య శివమ్మ కూడా నిరాశ్రయ స్థితిలో జీవిస్తున్నారు. కంబళి కప్పుకొని రోడ్డు పక్కన జీవిస్తున్న వీరి పరిస్థితిని గమనించిన తుడుం శ్రీనివాస్ వెంటనే స్పందించి దుస్తులు, వస్త్రాలు, నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలను అందించారు. గత పదేళ్లుగా గ్రామ ప్రజలు తమకు తోచిన విధంగా వృద్ధ దంపతులకు ఆహారం, నిత్యావసర వస్తువులు అందిస్తూ ఆదుకుంటున్నారని శ్రీనివాస్ తెలిపారు. అంకిరెడ్డిపల్లి ప్రజల్లో ఉన్న మానవత్వం, సేవా గుణం అభినందనీయమన్నారు. వృద్ధ దంపతుల పరిస్థితిని అక్కడి నుంచే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారని శ్రీనివాస్ తెలిపారు. ఐదు రోజుల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా/బ్యాంకు పుస్తకం ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీలోపు దివ్యాంగుల పెన్షన్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున, ఆలోపు అవసరమైన పత్రాలు, బ్యాంకు ఖాతా ఏర్పాటు చేయిస్తానని వి. హనుమంతరావు హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వృద్ధ దంపతుల పట్ల స్పందించి ప్రభుత్వ సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన వి. హనుమంతరావుకు కీసర మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## డెకరేషన్ గోదాంలో పామును చాకచకంగా పట్టుకున్న అభిరామ్.



వనపర్తి. సమయం ప్రతినిధి : వనపర్తి 9వ వార్డులో డెకరేషన్ సామాగ్రి గోదాంలో పాము ప్రత్యక్షం కావడంతో అక్కడ కొద్దిసేపు భయాందోళన నెలకొంది సూర్యచంద్ర స్కూల్ సమీపంలో చీర్ల రాజు సాగర్ కు చెందిన డెకరేషన్ గోదాంలో గురువారం మధ్యాహ్నం పాము కనిపించింది వెంటనే రాజు సాగర్ ప్రముఖ స్నేక్యాచార్ డాక్టర్ సదాశివయ్య శిష్యుడు అభిరామ్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అభిరామ్ తన బృందం సభ్యుడు శ్రీనుతో కలిసి గోదాంకు చేరుకొని పాము కోసం గాలించారు సామాగ్రి మధ్య దాగి ఉన్న పామును గుర్తించి ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా పట్టుకున్నారు. అనంతరం పామును జనావాసాలకు దూరంగా తీసుకెళ్లి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు ఈ సందర్భంగా అభిరాం శ్రీను అక్కడే ఉన్న ప్రజలకు పాముల సంరక్షణపై అవగాహన కల్పించారు పాము కనిపించినప్పుడు భయంతో దానిని చంపేందుకు ప్రయత్నించకుండా వెంటనే నిప్పులకు సమాచారం అందించాలని సూచించారు. పాములు పర్యావరణ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తాయని వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలియజేశారు.

సమయం
శనివారం 12 సెప్టెంబర్ 2026

# జ్వరంతో ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలి





**-ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఎక్స్‌రే, ల్యాబ్, ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి**
**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సమయం ప్రతినిధి :** శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా ఆసుపత్రిలోని ల్యాబ్, ఎక్స్‌రే గదిని కలెక్టర్ పరిశీలించారు. ప్రయోగశాలలో అందుబాటులో ఉన్న పరీక్షలు, రోజువారీగా నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి అందుబాటులో ఉన్న ఎక్స్‌రే యంత్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జ్వరంతో ఆసుపత్రికి వచ్చే రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జ్వర లక్షణాలతో వచ్చే రోగులకు డెంగ్యూ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. సకాలంలో వ్యాధిని గుర్తించి, అవసరమైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే క్షయ వ్యాధి అనుమానం ఉన్న రోగులను గుర్తించి, అవసరమైన వారికి ఎక్స్‌రే పరీక్షలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రులకు ప్రభుత్వం అందించిన ఎక్స్‌రే యంత్రాలను నిరుపయోగంగా ఉంచకుండా, అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సంబంధిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులపై కలెక్టర్ వైద్యులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసవాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు, ప్రసవ సమయంలో అందించాల్సిన సౌకర్యాలను సమర్థవంతంగా కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, ఇతర ప్రాంతాల్లో పరిశుభ్రతను ఎల్లప్పుడూ కాపాడాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు, వారి సహాయకులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ బాలుర హాస్టల్ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరిన ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహ భవనానికి సంబంధించి పూర్తి వివరాలతో ఫైల్‌ను సిద్ధం చేసి సమర్పించాలని ఎస్సీ సంక్షేమ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత భవనం పరిస్థితి, నూతన భవనం నిర్మాణం ఆవశ్యకత తదితర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల వసతికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు తాత్కాలికంగా వసతి కల్పించేందుకు అనువైన భవనాన్ని గుర్తించి, అవసరమైన సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాత్కాలిక భవనం గుర్తింపు, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం వంటి చర్యలను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీరావు, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు నేటి నుంచి ప్రత్యేక ప్రచార దినాలు



**పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు అందుబాటులో ఉండాలి**
**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రచార దినాలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు తప్పనిసరిగా అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు.

**కొత్త ఓటర్ల నమోదుకు ప్రాధాన్యం**

18 ఏళ్లు నిండిన యువతతో పాటు ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన పౌరులను గుర్తించి ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న యువతకు అవగాహన కల్పించి, ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**అనర్హుల పేర్ల తొలగింపులో జాగ్రత్త**

మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు తదితర అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించి ఫారం-7 ద్వారా తొలగించాలని సూచించారు. అయితే అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా తొలగిపోకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు.

**తప్పులుంటే సరిచేసుకోవాలి**

ఓటరు పేరు, వయస్సు, చిరునామా, ఫొటో తదితర వివరాల్లో తప్పులు లేదా మార్పులు ఉంటే ఫారం-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఓటరు నమోదు, తొలగింపు, సవరణలపై స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ కొత్త ఓటర్లను గుర్తించడంతో పాటు జాబితాలోని వివరాలను పరిశీలించాలని, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు పోలింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, పేరు తొలగింపునకు ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 దరఖాస్తులను సమర్పించి సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాలను అర్హులైన పౌరులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. ఓటరు జాబితా శుద్ధంగా, పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండేలా చూడటం అధికారుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# అశ్విని చంద్రశేఖర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11, సమయం ప్రతినిధి:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లయన్ అశ్విని చంద్రశేఖర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. పాలమూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిరా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
పాఠశాల ప్రగతి, విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకు అశ్విని చంద్రశేఖర్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జడ్జి డి. ఇందిరా చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కారం అందుకున్న అశ్విని చంద్రశేఖర్‌ను లయన్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నటరాజ్, పాలమూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి యతిరాజ చారి, కార్యక్రమ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కో-చైర్మన్ శ్రీహరి, సభ్యులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, అశోక్ కుమార్ తదితరులు ఘనంగా సన్మానించి అభినందించారు.

# భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ భేటీ..

హైదరాబాద్: నగరంలో గణేశ్ ఉత్సవాల సందడి మొదలైంది. సెప్టెంబరు 14న వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు యువత సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. పండగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఈరోజు (శుక్రవారం) భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవాలపై కమిటీ సభ్యులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీని కోరారు. విగ్రహాల ఆగమన సమాచారాన్ని ముందుగానే పోలీసులకు అందించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో వాహనాలపై డ్యాన్స్ చేస్తూ విగ్రహాలను తరలించొద్దని స్పష్టం చేశారు. వినాయక మండపాల వద్ద నలుగురు లేదా ఐదుగురు వాలంటీర్లను పెట్టాలని సూచించారు. అలాగే వారి వివరాలను పోలీస్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గణేశ్ ఉత్సవాల్లో శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085